కథ

# ఎర్ర నీళ్ళ వాన

-జగన్నాథ శర్మ




ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఎర్రటి ఎండ, ఉక్కపోతా ఏమయిపోయాయో తెలీదు. ఎవరో మంత్రించినట్టుగా ఆ రెండూ మాయమయిపోయి, వాటి స్థానంలో నల్లటి మబ్బు, గాలీ వచ్చాయి. గాలికి పార్కులో చెట్లన్నీ ఊగిపోసాగాయి. అక్కడక్కడా పడి ఉన్న చిత్తు కాగితాలు, ఎండిన ఆకులూ గాలికి పైకి లేచి పార్కులో ఉన్న వారి కళ్ళకి, కాళ్ళకీ అడ్డం పడుతోంటే 'ఛీఛీ' అనిపించింది. టప్...టప్...టప్...టపటపటపామంటూ చినుకులు ప్రారంభమయ్యాయి. 'రారా' అంటూ తన చేయి పట్టుకుని పరుగుదీసింది నళిని. ఆడపులి అంటారే! అలా పరుగెత్తింది నళిని. ఆమెని అనుసరించాడు తను. ఇద్దరూ పార్క్ వాచ్‌మన్ క్వార్టర్స్ దగ్గరకి వచ్చారు. అందరితో పాటు వర్షానికి తడవకుండా అక్కడ నిల్చున్నారు. ఆయాసపడుతోంది నళిని. నోరు తెరచి, ముక్కు రంధ్రాలు పెద్దవి చేసి ఊపిరి పీల్చుకుంటోందామె. తనూ ఆయాసపడుతున్నాడు. ఊపిరి పీల్చుకుందికి ముక్కు రంధ్రాలు పెద్దవి చేశాడు. నోరు కూడా తెరిచాడు.

నోరు ఇలా తెరిచాడో లేదో నోట్లోంచి నాలుక మూరెడు బయటికి వచ్చింది. గుండెల మీదఅది టైలా వేలాడసాగింది. ఏదయితే బయట పడకూడదని తనింతసేపూ జాగ్రత్తపడ్డాడో అదిప్పుడు బయటపడిపోయింది. ఎవరయినా చూస్తున్నారా? అని అటు ఇటూ చూసి, తననెవరూ గమనించట్లేదన్నది తెలుసుకుని గబగబా నాలుకను మడత పెట్టి నోట్లో కుక్కుకున్నాడు. మడత కాజాలా నోటినిండా నాలుకే! నోరు మూసుకున్నాడు.

టపటపటపామంటూ పడుతోన్న చినుకులు టప్...టప్...టప్మని ఆగిపోయాయి. అందరూ మళ్ళీ పార్కులోకి చేరుకోసాగారు. 'పద'అని నళిని పార్కులోకి లాగింది తనని.

''ఇప్పుడు చెప్పు! మనిద్దరం ఎప్పుడు లేచిపోదాం'' అడిగింది నళిని.

''ఏదో ఒకటి మనం ఇవాళ తేల్చుకోవాలి! తేల్చుకుంటే ఇవాళ రాత్రి మా వారికి చెప్పేస్తాను, మీ దారి మీది-నా దారి నాదని! ఏవంటావ్'' మళ్ళీ అడిగింది నళిని.

''వాడితో పడలేనురా! శాడిస్ట్ వాడు'' అంది.

''ఏవంటావ్'' అడిగింది.

''ఏంటి? నేనిలా మాట్లాడుతోంటే నువ్వేంటి ఏం మాట్లాడ్డం లేదు? నా ప్రపోజల్ నీకు నచ్చలేదా'' అడిగింది నళిని.

''నిన్నే అడుగుతోంది. మాట్లాడవేంటి'' రెట్టించింది. మాట్లాడాలనే ఉంది కాని, మాట్లాడాలంటే నోటినిండా నాలుకే ఉంది. మాట రావడం లేదు. పైగా మాట్లాడితే నాలుకెక్కడ పాములా దిగజారుతుందోనని భయంగా ఉంది.

''ఏంటి ప్రభూ! వాట్స్ యువర్ ఒపీనియన్? మాట్లాడు'' అంటూ మూసుకున్న తన నోరుని పెదవులు పట్టి తెరిచే ప్రయత్నం చేసింది నళిని. అంతే! సర్రున నాలుక అంత పొడవున ఊడిపడింది. చూసి 'కెవ్వు'మంది నళిని. భయంతో కళ్ళు మూసుకుంది.

''ప్రభూ! ప్రభూ'' అమ్మ పిలుపది. నిద్రలోంచి మేల్కొన్నాను. 'ఏంటమ్మా' అంటూ కళ్ళు నులుముకుని చూద్దునో! అమ్మ ఏడుస్తో కన్పించింది.

''ఏమైందమ్మా'' అడిగాను.

''రైతు బజార్లో నాన్ననెవరో చంపేశార్రా'' అంది అమ్మ.

''ఎందుకు? ఎందుకు చంపేశారు''

''కిలో పచ్చి మిర్చి వంద రూపాయలన్నార్ట! అయిదు రూపాయలకి ఇవ్వవా! అనడిగార్ట మీ నాన్న! అంతే! మాటా మాటా పెరిగిందట! మీ నాన్నని మిర్చీలమ్మేవాడు చంపేశాట్ట'' అమ్మ మాట పూర్తి కానేలేదు, నాన్న శవం కోసం పరుగుదీశాను. వీధిలోకి వచ్చి స్కూటర్ స్టార్ట్ చేస్తోంటే ఎదురింటిలో అద్దెకి ఉంటోన్న నళిని, ఆఫీస్కు వెళ్తోన్న వాళ్ళాయనకు 'టాటా' చెప్పేందుకు వీధిలోకి వచ్చింది. బైక్ మీద వెళ్తున్నాడతను.

''టిఫిన్ బాక్స్ జాగ్రత్త'' భర్తకి టిఫిన్ బాక్స్ అందించి నవ్వుతూ జాగ్రత్తలు చెప్పింది నళిని.

''ఓకే! ఓకే'' అని వెళ్ళిపోయాడతను. ఎంతకీ స్కూటర్ స్టార్టవ్వకపోవడంతో నానా బాధా పడుతున్నాను. అంతలో నా దగ్గరకు వచ్చి-

''ఇదిగో ఇదే నీకు లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్! పిచ్చి పిచ్చి వేషాలేస్తూ పదే పదే నువ్వు నా కలలోకి రాకు! వచ్చావనుకో! చంపేస్తాను. బీ కేర్ ఫుల్'' అని సీరియస్గా హెచ్చరిక చేసి వెళ్ళిపోయింది నళిని. అసలు కలలోకి వచ్చిందెవరు? గట్టిగా అడుగుదామనుకున్నాను. కాని, నోరిప్పే ప్రయత్నం చెయ్యలేదు. చేస్తే ఎక్కడ నాలుక జారుతుందోనని భయం. మరి ఇందాక అమ్మతో మాట్లాడినప్పుడు నాలుక జారలేదా?

జారే ఉంటుంది.అయితే తన బాధలో అమ్మ దానిని గమనించి ఉండదు. ఆఖరికి ఎలాగయితేనేం స్కూటర్ స్టార్టయ్యింది. బయల్దేరాను. నాన్న శవం ఇంకా రైతు బజార్లోనే ఉంటుందా? నోనో! ఉండే అవకాశం లేదు. ఎప్పుడో ఆసుపత్రికి తీసుకుని వెళ్ళిపోయుంటారు. పోలీసులు ఆలస్యం చేస్తారా? చెయ్యరుగాక చెయ్యరు-అనుకుంటూ సిగ్నల్ పడి ట్రాఫిక్ ఆగడంతో నేనూ ఆగిపోయాను. ఆగిన వాహనదారుల దగ్గరికి వచ్చి అడుక్కునే వాళ్ళు అడుక్కుంటుంటే, అమ్మజూపే వాళ్ళు వాహనదారులకు రకరకాల వస్తువులను అమ్మజూపుతున్నారు.

''కాళ్ళండి బాబూ కాళ్ళు! వెయ్యికి రెండు కాళ్ళు! ఒకటి కావాలంటే ఆరొందలు'' ఎవరో... మనిషి కాళ్ళను అమ్మజూపుతున్నాడు. అతని భుజమ్మీద జతలు జతలుగా కాళ్ళు వేలాడుతున్నాయి.

''బాబూ! కాళ్ళు! కాళ్ళు కావాలా'' ఓ జత కాళ్ళు తీసి చూపిస్తూ నన్ను అడిగాడతను.

'వద్దు' అన్నట్టుగా చేత్తో సైగ చేస్తే వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతోంటే ఇందాక నాకు చూపించిన కాళ్ళ వైపు అప్రయత్నంగా చూశాను. అవి...అవి నాన్నగారి కాళ్ళు! ఆ కాళ్ళు నాకు బాగా గుర్తు. మోకాలి మీద చిన్ననాటి గాయలకి గుర్తుగా ఆ పెద్ద పెద్ద మచ్చలూ...అవీ...అనుమానం లేదు. అవి నాన్నగారి కాళ్ళే! చిన్నప్పుడు ఎన్ని సార్లు వాటిని నేను ఒత్తలేదు? ఒత్తినందుకు పది పైసలో పావలో తీసుకునే వాణ్ణి.

''ఇదిగో'' అని కాళ్ళు అమ్మే వ్యక్తిని కేకేశానో లేదో! అప్పటికే నాన్నగారి కాళ్ళను అమ్మేసిన ఆ వ్యక్తి-

''కాళ్ళు కావాలా బాబూ'' అని రాబోతోంటే, ట్రాఫిక్ కదిలింది. వాహనాలు దూసుకు పోతున్నాయి. 'కావాల'ంటూ నిలబడే అవకాశం లేదు. నిలబడితే ప్రమాదం. దూసుకుపోక తప్పదు. దూసుకుపోయాను. అప్పుడే నాన్న కాళ్ళు కూడలిలో అమ్మకానికి వచ్చేశాయంటే... మిగిలిన నాన్న అంగంగాలూ ఎప్పుడో వేరయి పోయాయన్నమాట! ఆలస్యం చేస్తే ఆసుపత్రిలో నాన్నకి సంబంధించి ఏదీ మిగిలే అవకాశం లేదు! తొందరపడాలి! తొందరగా వెళ్ళాలి ఆసుపత్రికి- అనుకుంటూ స్కూటర్ను 'రయ్'న పోనిచ్చాను. ఆసుపత్రికి చేరుకున్నాను. రిసెప్షన్లో నాన్న సంగతి చెబితే-

''తొందరగా మార్చ్యురీకి వెళ్ళండి'' అన్నారు. అటుగా వెళ్తోంటే ఇఎన్టి వార్డు కనిపించింది. నాలుకతో నా వల్ల కావట్లేదు. నానా బాధలూ పడి నాలుకను పక్కకి జరిపి చిన్న చిన్న మాటలు మాట్లాడాల్సి వస్తోంది. పెద్ద మాటలు మాట్లాడితే పెను ప్రమాదమే! అందుకని దాని సంగతి ముందు తేల్చుకుందామనుకుని, ఇఎన్టి డాక్టర్ని కలిశాను.

''శరీరంలో అతి పెద్ద కండరం నాలుక'' అంటూ నా నాలుకను పరీక్షించసాగాడు డాక్టర్.

''ఏమైంది? ఈ నాలుక ఇంత పెద్దది ఎలా అయింది?'' అడిగాడు.

''తెలీదు'' అన్నాను. 'తెలీదు' అన్న మాట స్పష్టంగా పలికి ఉండను.

''అన్నిటికీ బాగా ఇబ్బంది పడుతున్నారనుకుంటాను''

''బాగా''

నాతో ఓ పక్క మాట్లాడుతోనే మరో పక్క నా నాలుకను కావాల్సిన మేర కత్తిరించాడు డాక్టరు. అందరి నాలుకల్లాగానే ఇప్పుడు నా నాలుక కూడ నోటికి సరిపడా ఎంచక్కా ఇమిడిపోయింది.

''ఓ నాలుగైదు రోజులు మరీ కూల్గా ఉన్నవి, మరీ హాట్గా ఉన్నవి తినకండి. తర్వాత ఓకే'' అన్నాడు డాక్టర్. నాలుక్కి ఆయింట్మెంటేదో రాసి-

''నౌ యు కెన్ గో'' అన్నాడు.

హాయిగా ఉందిప్పుడు. మాట్లాడితే నాలుక జారిపడుతుందని, అసహ్యంగా ఉంటుందన్న భయాలు లేవు. మార్చ్యురీ ముందు జనం గుంపుగా ఉన్నారు. ఎవరెవరి శరీరాల కోసమో ఎవరెవరో ఏడుపులు, పెడబొబ్బలు. రైతు బజార్ సంఘటన చెప్పి, నాన్న శవం కావాలన్నాను.

''కావాలంటే ఓ ఫుల్ బాటిల్ మందు, అయిదు వేలిచ్చుకో'' చెప్పాడు మార్చ్యురీ మనిషి. బాగా మందు మీద ఉన్నాడేమో తట్టుకోలేనంతగా కంపుకొడుతున్నాడు.

''మందు ఇప్పుడు ఎక్కడ దొరుకుతుంది?'' అడిగాను.

''అక్కడ'' అంటూ చూపించాడు. అతను చూపించిన వైపు పెద్ద వైన్ షాపు ఉంది. వెళ్ళి ఫుల్ బాటిల్ తీసుకున్నాను. దాన్ని తెచ్చి అయిదు వేలతో పాటుగా అతనికి ఇచ్చాను.

''మీ అయ్య మొత్తంగా లేడయ్యా! ముక్కలు ముక్కలుగా ఉన్నాడు. ఆ ముక్కల సంగతి దేనిగ్గాని ఈ తల దొరికింది. పట్టుకెళ్ళు'' అని నా స్కూటర్కి స్టెపెనీ ఉండే చోట నాన్న తలని గట్టిగా గుచ్చాడు. అదృష్టం! ముఖంలోని నాన్న కళ్ళనింకా

తొలగించలేదు. ఆ కళ్ళు తెరుచుకుని ఉండి పైకి చూస్తున్నట్టుగా ఉన్నాయి. వాటిని మూసే ప్రయత్నం చేశాను. నా వల్ల కాలేదు. 'సరే'నని అలాగే వదిలేసి, తిన్నగా స్మశానానికి చేరుకున్నాను. అమ్మకి ఫోన్ చేసి–

''తలొక్కటీ ఇంటికి ఏం తీసుకొస్తానమ్మా! అందుకని నేరుగా స్మశానానికి వచ్చేశాను'' చెప్పేను.

''నీ ఇష్టంరా'' అంది అమ్మ. మాట్లాడుతోంటే అమ్మేదో తింటున్నట్టుగా అనిపించింది.

''ఏం చేస్తున్నావమ్మా'' అడిగాను.

''ఆకలిగా ఉందిరా! టిఫిన్ చేస్తున్నాను'' అంది.

నాన్నని దహనం చెయ్యడానికి స్మశానంలో పదివేలు తీసుకున్నారు. ఎలక్ట్రికల్ క్రిమేషన్! నాన్న తల చూస్తూండగానే బూడిదయిపోయింది. కాలుతున్నప్పుడు కూడా నాన్న కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. ఓ పనయిందని అనుకున్నానో లేదో దాహం... ఆకలి... రెండూ ఒక్కసారిగా గుర్తొచ్చాయి. హోటల్‌కి బయల్దేరాను. స్కూటర్ మీద వెళ్తోంటే ఒకటే వర్షం. ఆకాశంలోంచి రక్తం కురుస్తున్నట్టుగా ఉంది. వర్షం నీరు ఎర్రగా కాలువలు కట్టి రోడ్డు మీద పారుతున్నాయి. ఆ నీటిలో ఓసారి స్కిడ్డయి జాగ్రత్తగా నిలదొక్కుకున్నాను. స్లోగా వెళ్తోంటే రోడ్డు మీద జనం గుంపుగా ఉండి, ఈలలేస్తూ చప్పట్లు చరుస్తున్నారు. అక్కడేం జరుగుతోంది? స్కూటర్ ఆపి, కుతూహలంగా తొంగి చూశాను. ఎవరో ఆడ–మగ...మంచి యవ్వనంలో ఉన్నారు. నగ్నంగా నడిరోడ్డు మీద పొర్లుతున్నారు. ఒకర్నొకరు గట్టిగా పట్టుకుని... కౌగిలించుకుని... ముద్దుపెట్టుకుంటూ పోట్లాడుకుంటున్నట్టుగా పొర్లుతోంటే వాళ్ళని ఉత్సాహపరుస్తూ జనం కేకలేస్తున్నారు. చూస్తోంటే బాగానే ఉంది. కాని, ఆకలిగా ఉండడంతో ఎంతో సేపు అక్కడ నిలబడలేకపోయాను. హోటల్‌కి వచ్చేసరికి అక్కడ టిఫిన్ చేస్తూ ఉత్తమ్ కనిపించాడు.

''ఏంటిలా తడిసిపోయావ్'' నన్నడిగాడు. జరిగిందంతా చెప్పాను.

''పోన్లే! అంకుల్ అదృష్టవంతులు! హాయిగా పోయారు'' అన్నాడు.

''అన్నట్టు... మీ ఆవిడ రజిత ఎలా ఉంది?'' ఉత్తమ్‌ని అడిగాను.

''ఎలా ఉందంటే ఏం చెప్పను? ఆసుపత్రిలో ఉంది'' అన్నాడు ఉత్తమ్.

''ఏమైంది'' అడిగాను. అంతలో వెయిటర్ వచ్చాడు. ఏం కావాలో చెప్పానతనికి. వెయిటర్‌కి కావాల్సింది ఆర్డర్ ఇస్తున్నప్పుడే వాళ్ళింట్లో రాత్రి జరిగింది చెప్పనారంభించాడు ఉత్తమ్. రాత్రి రెండున్నర–మూడు గంటల సమయంలో వాళ్ళింట్లో దొంగలు పడ్డారట! ముగ్గురు దొంగలు! ఉత్తమ్‌ని కుర్చీకి కట్టేసి, అతని కళ్ళ ముందే రజిత మానాన్ని వాళ్ళు దోచుకున్నారట! ఉదయం అయిదింటి వరకు అదే గోల. తర్వాత వాళ్ళు వెళ్ళిపోయారట!

''ఇప్పుడు ఎలా ఉంది రజితకి'' అడిగాను.

''నౌ షి ఈజ్ ఓకే'' అన్నాడు.

''ఇందాకే మీడియా వాళ్ళొచ్చారు. జరిగిన దాని మీద ఇంటర్వ్యూ చేస్తున్నారు'' అని చెప్పి–

''వస్తాను బాస్'' అని హడావుడిగా వెళ్ళిపోతుంటే–

''ఏంటంత హడావుడి'' అడిగాను.

''ఆఫీసుకి టైం అవుతోంది బాస్'' అని వెళ్ళిపోయాడు. టిఫిన్ చేసి, హోటల్‌లోంచి బయటపడేసరికి వర్షం లేదు. ఎండ మండిపోతోంది. రోడ్డు మీద ఇందాకటి వర్షం నీరు చుక్క కూడా లేదు. అంతా ఆవిరి అయిపోయినట్టుగా ఉంది. స్కూటర్ స్టార్ట్ చేసి బయల్దేరాను. అప్పుడే ఎండ...అంతలోనే వాన... మళ్ళీ ఎండ... ఈ వాతావరణాన్ని తట్టుకోలేకపోతున్నాను. ఏంటో అంతా ఇబ్బందిగా అనిపించి తలనొప్పి మొదలయింది. టాబ్లెట్ వేసుకుంటే నొప్పి తగ్గే రోజులు పోయాయి. దానంతటదే తగ్గాలి. తగ్గాలంటే ఏం చెయ్యాలి? ఆలోచనకేదీ అందటం లేదు. స్కూటర్ కూడా నడపలేని స్థితిలో ఉన్నాను. ఎక్కడో దగ్గర ఆగాలి. లేదంటే... తట్టుకోలేక పోతున్నాను.

చైల్డ్ బజార్!!

–కన్పించడంతో అక్కడ ఆగిపోవడం బెటర్ అనిపించింది. స్కూటర్ పార్క్ చేసి, బజార్లోకి దారి తీశాను. లెక్క లేనన్ని కౌంటర్లు. ఒకో కౌంటర్లో ఒకో రకమయిన పిల్లలు! ప్రపంచంలోని అన్ని దేశాలకు చెందిన పిల్లలూ కొలువుదీరి ఉన్నారక్కడ. అమ్మకానికి అందంగా నవ్వుతూ పాకుతున్నారు. మెళ్ళో ప్రైస్ టాగ్‌తో చూడముచ్చటగా ఉన్నారు. పిల్లల్ని కనడం కష్టమనిపించడంతో అంతా పిల్లల్ని కొనుక్కుంటున్నారు. పెంపకానికి ఆయాలు ఉండనే ఉన్నారు. చేతికి పిల్లల ఏ తడీ అంటకుండా వాళ్ళతో ఆడుకోవచ్చు. అక్కర్లేదనుకుంటే వదుల్చుకోనూ వచ్చు. ఆ సౌలభ్యాన్ని కూడా బజార్లు కల్పిస్తున్నాయి.

''కావాలా సార్! ఇటాలియన్ బ్రీడ్'' ఓ చంటి పాపను ఎత్తుకుని నవ్విస్తూ అడిగాడు కౌంటర్లోని వ్యక్తి.

''ఎంత'' అడిగాను.

''జస్ట్ ట్వంటీ ఫైవ్ థౌజెండ్! వన్ ఇయర్ గ్యారంటీ'' చెప్పాడతను. పిల్ల చాలా బాగుంది. ఆ పిల్ల నవ్వు కూడా బాగుంది. ఎత్తుకోవాలనిపించి, చేతులు చాచాను.

''వన్ మినిట్'' అని–

''ఇదిగో'' కేకేశాడు. ఓ కుర్రాడు వచ్చాడు.

''సార్ పాపను చూస్తానంటున్నారు! గ్లౌవ్స్ ఇవ్వు'' అన్నాడు. కుర్రాడు గ్లౌవ్స్ ఇచ్చాడు. చేతులకి వాటిని ధరించి, పాపని అందుకున్నాను. పాల బుగ్గలు... పాల పెదవులు... బలే ఉంది పాప. పాప బుగ్గలకి నా బుగ్గల్ని అదిమాను. నవ్వింది పాప. మరింతగా అదిమాను. నవ్వుతోంది పాప. పాపను గుండెలకి హత్తుకున్నాను. చాలా హాయిగా ఉంది. చెప్పలేనంత ఆనందంగా ఉంది. తలనొప్పి ఎగిరిపోయింది. చాలనుకున్నాను.

''ఏంట్సార్! కావాలా'' కౌంటర్లోని వ్యక్తి అడుగుతున్నాడు.

**''నోనో! తర్వాత చూద్దాం'' అంటూ అతనికి పాపను అందించేశాను. ఉత్సాహంగా బయటికి నడిచాను. మళ్ళీ వర్షం ప్రారంభమయింది. ఈసారి ఆ నీటికి ఏ రంగులూ లేవు. స్వచ్ఛంగా కురుస్తోంది.**

❑

